నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఉప్పునుంతల, సెప్టెంబర్ 2 : మూడు రోజులుగా మండలంలో విస్తృతంగా కురుస్తున్న వర్షాలకు పత్తి చేలు వివిధ రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రావు సోమవారం డిమాండ్ చేశారు. రైతులు ఇటీవల వేసిన వరినాట్లు, చేతికి వచ్చిన పత్తి చేను వర్షం నీటిలో కొట్టుకపోయినట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు పర్యటించి రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు.

దాసర్లపల్లిలో నీటమునిగిన వరి చేను

బిజినేపల్లి మండలంలో..

బిజినేపల్లి, సెప్టెంబర్ 2 : మండలంలోని వెల్గొండ, లట్టుపల్లి, బిజినేపల్లి తదితర గ్రామాల్లో వర్షానికి నష్టపోయిన పంటను జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో కలిసి అధికారులు పంట పొలాలను కలియదిరిగారు. నష్టపరిహారం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. అనంతరం బిజినేపల్లిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో నీతి, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

తెలకపల్లి మండలంలో..

నాగర్‌కర్నూల్ : పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 2 : తెలకపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వర్షం తాకిడికి నష్టపోయిన పంటలను సోమవారం జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్, ఏవో నర్మద పరిశీలించారు. మండలంలోని చిన్నముద్దునూర్, ఆలేరు, రాకొండ, బొప్పల్లి తదితర గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి శ్రావ్య, అధికారులు, రైతులు ఉన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్యయాదవ్

కోడేరు, సెప్టెంబర్ 2 : జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్ట పోయిన రైతుల పొలాలను పరిశీలించి వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్యయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రేకులపల్లి శివారులో వరదనీటి మునిగిన రైతుల పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల రైతులు వరి నాట్లు వేసుకొన్నారని, కాగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీటి ఉధృతికి వరి నాటుకున్న రైతుల పంటలు కొట్టుకుపోయని తెలిపారు. నష్టపోయిన రైతుల పంటల వివరాలను సేకరించి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతులు బాలయ్య, లక్ష్మణ్, కృష్ణయ్య, అయ్యన్న, జంబ్లీ, అలివేల, శంకర్, బాలకృష్ణయ్య పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ : ఎండబెట్ల వైపు అలుగు వద్ద రోడ్డుపై నుంచి పారుతున్న వర్షపునీరు

ముంచెత్తిన వాన

- అలుగుపారుతున్న చెరువులు, కుంటలు
- ఆయా గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- జనం ఇక్కట్లు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 2 : మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నాగర్‌కర్నూల్ మండలంలో చెరువు, కుంటలు అలుగుపారుతున్నాయి. మండలంలో పెద్ద చెరువు అయిన నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం, నాగనూలు నాగసముద్రం చెరువులు రెండు రోజులుగా నిండుకుండల్లా అలుగుపారుతున్నాయి. నాగర్‌కర్నూల్ చెరువుకు ఎండబెట్ల, నాగర్‌కర్నూల్ ఇరువైపులా ఉన్న అలుగులు ఉధృతంగా పారుతున్నాయి. ఎండబెట్ల వైపునకు రోడ్డు కింద అలుగు ఉన్నప్పటికీ నీటి ఉధృతికి రోడ్డుపై నుంచి అలుగు పారుతుండగా నాగర్‌కర్నూల్ వైపునకు ఉన్న అలుగు ఏకంగా మూడు ఫీట్ల ఎత్తులో నీరు పారుతోంది. దీంతో మినీ ట్యాంక్‌బండ్ నుంచి ఎండబట్లకు రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా ఉయ్యాలవాడ నుంచి చర్లతిర్మలాపూర్ వైపు వెళ్లే దారి చెరువులోనుంచి ఉండడంతో నీటి ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా తూడుకుర్తి వెళ్లే దారిలో భాగ్యనగర్‌కు వెళ్లే చౌరస్తాలో వాగు నుంచి నీటి ఉధృతి పెరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, సెప్టెంబర్ 2: మండలంలోని ఆయా గ్రామాల్లో మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు చెరువు, కుంటలు జలమయమై పొంగి పొరలుతున్నాయి. కాగా వెంకటాద్రి రిజర్వాయర్ సమీపంలో వట్టం నిర్వాసితులు నిర్మించుకుంటున్న ఇళ్లపై పక్కనే ఉన్న గుట్టనుంచి కొండ చరియలు విరిగి పడడంతోపాటు ఇళ్లలోని వర్షపునీరు చేరుకున్నది. కొన్ని గ్రామాల్లో పురాతన ఇళ్లు నేలకూలాగా రహదారులు జలమయమయ్యాయి.

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, సెప్టెంబర్ 2 : ఎడతెర్పి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న వాగులు, చెరువులు, కుంటలు అలుగులు పారుతుండడంతో జనజీవనం స్తంభించి పోయింది. మూడు రోజులుగా పెంట్లవెల్లి నుంచి మంచాలకట్ట, మాదవస్వామినగర్ గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా వాగు ప్రవాహంలో మునిగిపోవడంతో రాకపోకలు నిల్చిపోయాయి. అదేవిధంగా కృష్ణానదీ తీరం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్ గ్రామాల్లో మత్స్యకారులు నదీతీరంలోకి వెళ్లకుండా స్థానిక ఎస్సై రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్, సెప్టెంబర్ 2 : మండలంలోని ఆయా గ్రామాలో శుక్రవారం నుంచి కురిసిన భారీ వర్షాల దాటికి కొల్లాపూర్ పరిధిలోని రిజర్వాయర్‌లు, చెరువులు నిండి అలుగు పారడంతో అపారనష్టం చోటు చేసుకున్నది. మండలంలోని పెద్దవాగుతో ముక్కిడిగుండం గ్రామానికి రాకపోకలు నిలిచిపోవడంతో పాటు విద్యుత్ అంతరాయం కూడా ఏర్పడింది. చౌటబెట్ల, తాళ్లనర్సింహాపురం, ఎన్మన్‌బెట్ల గ్రామాల రోడ్డు వరద ఉధృతికి తెగిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 250 ఎకరాల్లో వరి పంటలు పాల్గొన్నారు.

కొల్లాపూర్ : ఎన్మన్‌బెట్ల గ్రామానికి వెళ్లే రోడ్డు తెగిపోయిన దృశ్యం

వెల్దండలో కేఎల్ఐ కాల్వను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఈ సమ్మయ్య

నష్టం జరిగిందని తెలిపారు.

ఊర్కొండలో..

ఊర్కొండ, సెప్టెంబర్ 2 : మండలంలోని రాంరెడ్డిపల్లిలోని ఎస్సీ కాలనీలో సోమవారం ఎంపీడీవో కృష్ణయ్య పాడుబడిన ఇండ్లను పరిశీలించారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు గ్రామంలో పాక్షికంగా కూలిన ఇండ్లను పరిశీలించి బాధితులను ఎస్సీ కమిటీహాలులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జగబోయిన్‌పల్లి, బాల్యాలోకతండాల్లో పర్యాటించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్ నాయక్, ఏపీవో, నర్సింహులు పాల్గొన్నారు.

బల్మూరులో..

బల్మూరు, సెప్టెంబర్ 2 : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు నిండి అలుగుపారుతున్నాయి. ఆదివారం మధ్యరాత్రి భారీ వర్షం కురవడంతో ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుకుండల కనువిందు చేస్తున్నాయి. గ్రామాల్లో మట్టి ఇండ్లు కూలిపోగా సోమవారం అధికారులు గ్రామాల్లో పర్యాటించి కూలిన ఇండ్ల వివరాలను నమోదు చేసుకున్నారు. కొండారెడ్డిపల్లిలో చెరువు, కుంటలు అలుగుపారడంతో గ్రామస్తులు రాధాకృష్ణ, నిరంజన్, శ్రీను, వెంకటయ్య, విష్ణులు హర్షం వ్యక్తం చేశారు.

బిజినేపల్లి : వెంకటాద్రి రిజర్వాయర్ ఇళ్ల సమీపంలో విరిగిపడిన కొండ చరియలు

పెంట్లవెల్లి : మాధవస్వామినగర్ గ్రామ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

బల్మూరు : కొండారెడ్డిపల్లిలో మత్తడి పారుతున్న గువ్వకుంట

కేఎల్ఐ డీ82 కాల్వ పరిశీలన

వెల్దండ, సెప్టెంబర్ 2 : మండలంలోని వెల్దండ, గుండాల గ్రామాల రెవెన్యూ శివారులో కేఎల్ఐ డీ82 కాల్వను కేఎల్ఐ డిప్యూటీ ఈఈ సమ్మయ్య సోమవారం పరిశీలించారు. ఎగువ నుంచి వస్తున్న సాగునీరు దిగువకు పోకుండా నిల్చిపోవడంతో కాల్వ తేగే పరిస్థితి ఉందని కొంత మంది రైతులు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి సమాచారం ఇవ్వగా, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డిప్యూటీ ఈఈ కాల్వను పరిశీలించారు. అయితే కొంత మంది రైతులు కాల్వ దాటేందుకు గూనలు వేసే క్రమంలో కాల్వకు అడ్డంగా రాళ్లు పడడం వల్ల నీరు పోకుండా నిలిచిపోయ్యాయని గుర్తించిన డిప్యూటీ ఈఈ సమ్మయ్య జేసీబీ సహాయంతో రాళ్లను తొలగించి నీరు సాఫిగా వెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు ఉన్నారు.

ఊర్కొండ : రాంరెడ్డిపల్లిలో కూలిన పాత ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణయ్య

ఉల్పర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు

పాఠశాలనా.. నీటి కుంటనా..?

- పట్టించుకోని అధికారులు, పాలకులు

వంగూరు, సెప్టెంబర్ 2 : మండలంలోని ఉల్పర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొన్నది. పాఠశాల ఆవరణం చెరువును తలపిస్తుంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే చెరువులాంటి ఆ నీటి లోంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నీరు నిలిచిన స్థలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మొరం కొట్టించి చదును చేస్తే ఈ సమస్య వచ్చేది కాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కానీ అధికారులు మాత్రం పాఠశాల సమస్యలను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చెరువును తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పసుపుల వాగులో నిరసన తెలుపుతున్న యువకులు

పసుపుల వాగుపై వంతెన నిర్మించాలి

కోడేరు, సెప్టెంబర్ 2 : మండలంలోని పసుపుల వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని కోడేరు మండల కేంద్రానికి చెందిన యువకులు సోమవారం నిరసన తెలిపారు. కోడేరు మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగు వర్షపు నీటితో పొంగి ప్రవహిస్తుండడంతో కోడేరు, పెద్దకొత్తపల్లి నాగర్‌కర్నూల్ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కోడేరుకు చెందిన యువకులు రవి, రాజేశ్ మరికొందరు యువకులతో వాగునీటిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా కొల్లాపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం ప్రవహిస్తున్న పాలకులే నేడు కూడా నియోజవర్గాన్ని పాలించడం జరుగుతుందన్నారు. మరి నేటికైనా మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి వెంటనే వంతెన నిర్మాణం కోసం అవసరమైన నిధులను కేటాయించి వంతెన నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

దుందుభీ పరవళ్లు

- 19 గంటల్లోనే నిండిన డిండి ప్రాజెక్టు
- నదీ పరిసర గ్రామాల రైతుల్లో ఆనందం

వంగూరు, సెప్టెంబర్ 2 : మండలంలోని పలు గ్రామాల సరిహద్దులను ముద్దాడుతూ ప్రవహిస్తున్న దుందుభీ నది వీరవిహారం చేస్తుంది. దీంతో కేవలం 19 గంటల్లోనే డిండి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. దీంతో మండలంలోని తిరుమలగిరి, తిప్పారెడ్డిపల్లి, గాజర, నిజాంబాద్, ఉమ్మాపూర్, డిండిచింతపల్లి, మిట్టసదగోడు, ఉల్పర, పోతారెడ్డిపల్లి, కోనాపూర్, జాజాల, అన్నారం గ్రామాలకు చెందిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతుల వ్యవసాయ బోరు బావుల్లో పుష్కలంగా నీరు చేరి యాసంగి పంటలకు సాగునీరు అంది ఆశించిన స్థాయిలో దిగుబడి లభిస్తుందని రైతులు పేర్కొన్నారు. అలాగే మత్స్యకారులు చేపలు పట్టి జీవనం సాగించేందుకు ఎంతో దోహదపడుతుంది. డిండి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 36 ఫీట్లు నిండి డ్యాం దూకడంతో పర్యాటకుల తాకిడి తీవ్రమైంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న డిండి ప్రాజెక్టు అలుగు

నాగర్‌కర్నూల్ : కేసరి సముద్రం చెరువు అలుగు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

సమన్వయంతో సహాయ చర్యలు అందించాలి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 2 : వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి కోరారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నాగర్‌కర్నూల్‌లోని కేసరి సముద్రం చెరువు నిండి అలుగు పారుతుండడంతో సోమవారం ఆయన పరిశీలించి అలుగువద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత చెరువులు అలుగుపారుతున్నాయని, ఇది మనమంతా సంతోషించాల్సిన విషయమన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను వెంటనే గుర్తించి అందులో నివసిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించి అక్కడ సౌకర్యాలు కల్పించాలన్నారు. భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి నివేదికలు పంపాలని వ్యవసాయాధికారులకు సూచించారు.

బాధితులకు తక్షణ సాయం అందించాలి

తాడూరు, సెప్టెంబర్ 2 : మండలంలోని సిర్సవాడలో అకాల వర్షానికి సుమారు 250 గొర్లతోపాటు ఇరువురు వరదలో చిక్కుకొని అవస్థలు ఎదుర్కొన్న ఘటనకు అధికారులు స్పందించి ఇరువురు ప్రాణాలను కాపాడడం జరిగిందని, జీవాల నష్టాన్ని గుర్తించి వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి కలెక్టర్ సంతోష్‌ను బాధితులు కోరారు. సోమవారం వరద ప్రాంతాల సందర్శనలో భాగంగా తాడూరు మండలంలో పర్యటించిన ఆయన సిర్సవాడ గ్రామానికి చేరుకొని బాధితులతో ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా దుందుభీ వాగుని పరిశీలించి సిర్సవాడ గ్రామానికి త్వరలో బ్రిడ్జి మంజూరు చేయిస్తానని తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 2: తిమ్మాజిపేట మండలంలో కురుస్తున్న వర్ష ప్రభావిత ప్రాంతాల్లో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి సోమవారం తిమ్మాజిపేటతోపాటు ఇప్పలపల్లి, ఎదిరేపల్లి, మారేపల్లి, నేరళ్లపల్లి, గొరిట గ్రామాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దెబ్బతిన్న పంటలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. అధికారులు నష్టానికి సంబంధించిన అంచాలు వేసి నివేదికలు పంపించాలన్నారు. తిమ్మాజిపేటలో ఇండ్లు కూలిన బాధితులను పరామర్శించారు.

నేరళ్లపల్లిలో అలుగుపారుతున్న నడుపులమ్మ చెరువు వద్ద పూజలు నిర్వహించారు. ఆయన వెంట తాసీల్దార్ మోహన్, ఎంపీడీవో లక్ష్మీదేవి, వ్యవసాయాధికారి కమల్‌కుమార్ ఉన్నారు.

ముంపు గ్రామాల కుటుంబాలను ఆదుకుంటాం

- కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, సెప్టెంబర్ 2 : నక్కలగండి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న నక్కలగండితండా, మార్లపాడుతండా, కేశ్యతండా, మన్నెవారిపల్లి గ్రామాల నిర్వాసితులకు ఒక నెలలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా ఇండ్ల నిర్మాణానికి అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేసి నిర్మాణాలు ప్రారంభిస్తామని కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేట మండలంలోని మార్లపాడుతండాను కలెక్టర్, ఎమ్మెల్యే కలిసి జేసీబీపై ప్రయాణించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం మేరకు కల్వకుర్తి సమీపంలోని జేపీనగర్, తుక్కుగూడ, దేవరకొండ, చింతపల్లి వద్ద ప్రభుత్వ భూమిని గుర్తిస్తే స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అక్కడ అందరికీ ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకుంటే అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ వద్ద ఇదివరకే గుర్తించిన స్థలంలో ఆర్‌అండ్‌ఆర్ ద్వారా పూర్తిస్థాయి నిర్మాణాలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. మార్లపాడుతండాకు సంక్షేమ పథకాలు అమలయ్యేవిధంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని పేర్కొన్నారు. రేషన్‌కార్డులు లేనివారికి తొందరలోనే అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ రానున్న నెల రోజుల్లోనే అనువైన స్థలంలో అన్ని వసతులతో కూడిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు సీఎం రేవంత్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో మాట్లాడి వెంటనే అమలు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ముంపు గ్రామా ల ప్రజల కోరిక మేరకు ఐదుగురితో కమిటీ వేసి స్థల సేకరణ కోసం ప్రత్యేకంగా కృషిచేస్తామన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో అండగా ఉండి ఆదుకుంటామన్నారు. అంతకుముందు నక్కలగండి ప్రాజెక్టు నీటిలో నాటు పడవలో వెళ్లి పరిశీలించారు. అనంతరం మన్నెవారిపల్లి సమీపంలో దేవరకొండ చందంపేట, మన్నెవారిపల్లి గ్రామాల రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నదిని కలెక్టర్ పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరిగివస్తుండగా కలెక్టర్, ఎమ్మెల్యే చందాపూర్ వద్ద చంద్రసాగర్‌వాగు ప్రవాహాన్ని బ్రిడ్జిపై నుంచి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో మాధవి, డీఎస్పీ శ్రీనివాస్, తాసీల్దార్ మురళీమోహన్, సీఐ రవీందర్, అధికారులు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు గోపాల్‌రెడ్డి, రామనాథం, లోక్యనాయక్, లచ్చునాయక్, రాజే శ్, మాజీ సర్పంచ్ భాస్కర్, మల్లేశ్, సక్రు, రాఘవులు పాల్గొన్నారు.

అచ్చంపేట : మార్లపాడుతండా వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే వంశీకృష్ణ

రుసుల్‌చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

రుసుల్ చెరువును టూరిజంగా అభివృద్ధి చేస్తాం

బల్మూరు, సెప్టెంబర్ 2 : నల్లమల ప్రాంతం దట్టమైన అటవీలో ఉన్న రుసుల్ చెరువును టూరిజం ద్వారా అన్ని విధాల అభివృద్ధి చేస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని బిల్లకల్ సమీపంలో దట్టమైన అడవీలో ఉన్న రుసుల్ చెరువును కలెక్టర్ సంతోష్, డీఎఫ్‌వో రోహిత్‌తో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి ఈప్రాంతంలో ఉన్న చెరువు, పరిసరాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. చెరువు తూమ్, అలుగు కట్ట తదితర పనులకు సంబంధించి ప్రతిపాదనలను వెంటనే పంపించాలని ఇరిగేషన్ ఏఈ రమేశ్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్సై గురుస్వామి, ఫారెస్ట్ అధికారులు తిరుమలరావు, రేణుక, తాసీల్దార్ శైలేంద్రకమార్, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీపతిరావు, పద్మ, చంద్రమోహన్, రామచంద్రం, అశోక్, మ శన్న, రమేశ్, శ్రీను, బుచ్చన్న, బాలయ్య ఉన్నారు.